క్యూఆర్‌కోడ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ, అధికారులు

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 9: పోలీసుల సేవలపై పిటిషనర్లు, బాధితులు తమ అభిప్రాయాన్ని సులభంగా అందించడానికి ఏర్పాటు చేసిన క్యూఆర్‌కోడ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ కోరారు. క్యూర్ కోడ్ పద్ధతిని డీజీపీ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. రామగుండం సీపీ కమిషనరేట్ పోలీసు అధికారులతో ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. పోలీస్టేషన్‌లో ఫిర్యాదుదారులు, బాధితులకు సంబంధించి పోలీసుల పని తీరు, ప్రవర్తన, స్పందించిన విధానంపై ప్రజలు తమ అభిప్రాయం తెలుపడం కోసమే రాష్ట్రవ్యాప్తంగా క్యూఆర్‌కోడ్ పద్ధతిని డీజీపీ ప్రారంభించినట్లు సీపీ తెలిపారు. ఈ క్యూఆర్‌కోడ్ ద్వారా పీడ్‌బ్యాక్ సేకరణ జరుగుతుందన్నారు. స్కాన్ చేసి పోలీసు సేవలపై ప్రజా అభిప్రాయం తెలుపాలన్నారు. ఈ జూమ్ మీటింగ్‌లో డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సతీశ్, సీఐలు రవీందర్, చంద్రశేఖర్‌గౌడ్, కృష్ణ, శ్రీధర్, ఐటీ అండ్ కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఆర్ఐ దామోదర్, సీసీ హరీశ్, ఐటీకోర్ రాము ఉన్నారు.

ఊరికెళ్తున్నారా.. జాగ్రత్తలు తీసుకోండి

సంక్రాంతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంతూళ్లు, బంధువుల ఇళ్లు, విహారయాత్రలకు వెళ్తున్నారా.. జాగ్రత్తలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఒకట ప్రకటనలో జాగ్రత్తలు సూచించారు. సోషల్ మీడియాలో లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎక్కడికి వెళ్తున్నారో తెలిపే అప్‌డేట్స్ పెట్టవద్దని సూచించారు. స్వీయ రక్షణకు ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టామని, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 100కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులు అవలంబించాలి

డ్రోన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జనవరి9: ఆధునిక సాగు పద్ధతులతో మంచి ఉత్పత్తి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో విఘ్నేశ్వర డ్రోన్స్ సేల్స్ అండ్ సర్వీసెస్‌కు సంబంధించిన 4 డ్రోన్ వాహనాలను ప్రారంభించారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా నాట్లు వేయటం , పురుగుల మందు, గడ్డి మందు స్ప్రే చేయడం, ఎరువుల వినియోగం వంటి వాటికి డ్రోన్ సేవలను వినియోగించవచ్చని పేర్కొన్నారు. డీఏవో దోమ ఆదిరెడ్డి, విఘ్నేశ్వర డ్రోన్ నిర్వాహకులు రమేష్, సంపత్, మహేందర్, అఖిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రామగిరి, జనవరి 9 : రత్నాపూర్ రైతు వేదికలో గురువారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టులో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, నాగెపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య పలు సమస్యలపై తెలంగాణ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలచారి, కే రమేశ్, ఫైనాన్స్ మెంబర్ చరణ్ దాస్, ఇండిపెండెంట్ మెంబర్ ఎం రామారావులకు వినతి పత్రాలు అందజేశారు. తమ గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్పు, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలని వినతి

కమాన్‌పూర్, జనవరి 9:మండలంలో ఉన్న ప్రస్తుతం ఉన్న ఏడు ఎంపీటీసీ స్థానాలకు అదనంగా మరో ఆరు స్థానాలు పెంచేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపించాలని కోరుతూ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో లలితకు గురువారం వినతి పత్రం అందజేశారు. మండలంలో పెరిగిన జనాభా, ఓటర్ల ప్రాతిపాదికన గతంలో నిర్ధారించిన ఎంపీటీసీ స్థానాలకు అదనంగా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలో ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాలకు అదనంగా మరో రెండు స్థానాలు పెంచాలని, జూలపల్లిలో ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాలకు అదనంగా మరో స్థానం పెంచాలని కోరారు. రొంపికుంటలో మరొకటి, గుండారం, పేరపల్లి, గొల్లపల్లి పంచాయతీల్లో ఒక్కో స్థానం చొప్పున పెంచాలని, పెంచికల్‌పేట, నాగారం గ్రామ పంచాయతీల్లో మరో స్థానం పెంచాలని విన్నవించారు. దీంతో మండలంలో పరిపాలనా పరంగా మరింత సౌలభ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ శంకర్, యూత అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మమల్లు, జూలపల్లి మాజీ ఉప సర్పంచ్ పోలు దాసరి సాయికుమార్, తోడేటి రాజీర్, తోట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లి, జనవరి9: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఇక్కడ టీజీవో అధ్యక్షుడు తూము రవీందర్, కార్యదర్శి ఎల్ బ్రహ్మానంద రెడ్డి, సహ అధ్యక్షురాలు కే అలివేణి, కోశాధికారి కరుణాకర్, ఉపాధ్యక్షులు కుమార్, ఎండీ సాజిద్ అలీ, కరుణాకర్, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, మధు, అనూష, అలేఖ్య, కార్యనిర్వాహక కార్యదర్శి సురేశ్, ప్రచార కార్యదర్శి శ్రీకాంత్, కార్యాలయ కార్యదర్శి శంకర్ యాదవ్, సాంస్కృతిక కార్యదర్శి తిరుమల్, క్రీడల కార్యదర్శి మధు బాబు, కార్యవర్గ సభ్యులు గంగ ప్రణవ్, సతీష్, రాఘవేంద్ర చారీ, సిందూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దపల్లి, జనవరి9: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా లేబర్ సేఫ్టీ జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని ఎన్‌పీడీసీఎల్ పెద్దపల్లి ఎస్ఈ కంకటి మాధవరావు కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం ఎస్ఈ కార్యాలయంలో లేబర్ సేఫ్టీపై కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, పనులు చేసేటప్పుడు సేఫ్టీ టూల్స్, ఎక్విప్‌మెంట్స్‌ను ఉపయోగించాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీఈలు బీ రవి(టెక్నికల్) డీ తిరుపతి (ఆపరేషన్), కాంట్రాక్టర్లు అలుగుబెల్లి కృష్ణా రెడ్డి, ఎం సుధాకర్, రాధయ్య, సమ్మయ్య, ఆనంద్, రాజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, భూమయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఉద్యోగులు

సుల్తానాబాద్‌రూరల్,జనవరి 9: తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం ఇచ్చి శాలువతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘాన్ని టీఎన్‌జీవో సంఘంలో మిలీనం చేయడం జరిగిందని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల నర్సింహులు తెలిపారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి మీకు న్యాయం జరిగే కృషి చేస్తామని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ తెలిపారు.

భూకంపం వచ్చిందా..?

- అదిలిన ఇండ్లు.. హడలెత్తిన ప్రజలు
- సింగరేణి ఓసీపీల్లో బ్లాస్టింగ్‌ల మోతలు
- దద్దరిల్లిన సమీప కాలనీలు
- భయంతో బయటకు పరుగులు తీసిన జనాలు
- రోజంతా శ్వాసకోశ సమస్యలతో ఉక్కిరి బిక్కిరి

ఫైవింక్లయిన్ ఏరియాలో ఆందోళనకు దిగిన బాధితులతో కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్

కోల్‌సిటీ, జనవరి 9: గోదావరిఖని ఫైవింక్లయిన్ ఏరియాలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఇండ్లు అదలడంతో జనం భయాందోళన గురయ్యారు. భూకంపాన్ని తలపించేలా సింగరేణి ఓసీపీ-3, 5 లలో గురువారం మధ్యాహ్నం షిఫ్టులలో 4 గంటల ప్రాంతంలో జరిగిన బ్లాస్టింగ్‌లతో సమీప ప్రజలు హడలెత్తిపోయారు. రెండు,మూడు రోజుల నుంచి ఓసీపీలలో బ్లాస్టింగ్‌ల మోతాదును పెంచడంతో గోదావరిఖనిలోని ఫైవింక్లయిన్, విఠల్‌నగర్, జవహర్‌నగర్, తిలక్‌నగర్‌లో నివాస గృహాలు అదలడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. యథావిధిగా బ్లాస్టింగ్‌ల ప్రభావంతో దుమ్ము,ధూళి లేచి సమీప కాలనీలను ముంచెత్తింది. ఆ డివిజన్‌లోని పిల్లలు, వృద్ధులు ఒక్కసారిగా శ్వాసకోశ సమస్యలతో ఉక్కిరి బిక్కిరయ్యారు. రాత్రి దాకా దుమ్ము కమ్ముకొని ఉండడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. 12వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ ఆధ్వర్యంలో స్థానికులు వందలాదిగా రోడ్డెక్కారు. బ్లాస్టింగ్ దెబ్బలకు హడలెత్తిన ప్రజలు భయంతో బయటకు పరుగులు పెట్టారు. అంతా ఫైవింక్లయిన్ చౌరస్తాకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొడ్డు రజిత మాట్లాడారు. కొద్ది రోజులుగా ఓసీపీ-3, 5ల్లో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌ల మోతాదు పెంచడంతో ఇండ్లన్ని అదులుతున్నాయని, ఎప్పుడు కూలిపోతాయోనని భయంతో బతకాల్సిన పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్‌ల మోతాదు తగ్గించకుంటే వందలాది కుటుంబాలతో ఓసీపీలలో బొగ్గు ఉత్పత్తిని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బండ సమ్మయ్య, భూతగడ్డల కనకయ్య, మల్యాల రాజయ్య, మేకల నవీన్, సంసాని విద్యాసాగర్, చొప్పరి శ్రీను, కనకమ్మ, రాజేశం, రాములు, మనోజ్, తిరుపతమ్మ, భూతం రమ, రాసమల్ల రాజమణి, మల్లమ్మ, విజయ, చీకట్ల రాణి, సంసాని రేణుక, సంసాని లావణ్య, విజయ నిర్మల, సుంకరి దీపిక, బుర్రి లక్ష్మీ, పిడుగు రాయమల్లమ్మ, కోమల, పూదరి లక్ష్మీ, మంజుల, లావణ్య, రాసముల లక్ష్మీ, వజ్రవాణి, రాగి ప్రమీల, వందల సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

జ్యోతినగర్, జనవరి 9: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వివిధ శాఖల అధికారులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో నియోజకవర్గంలోని పాలకుర్తి, అంతర్గాం మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సహకరించాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న క్రమంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అమలు పకడ్బందీగా వ్యవహరించాలని సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా 2025 క్యాలెండర్‌ను విడుదల చేశారు. తహసీల్దార్లు రవీందర్, జ్యోతి, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, ఎంపీడీలోలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పెరుగుతున్న పత్తి ధర

పెద్దపల్లి, జనవరి9: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర పెరుగుతున్న ది. ఇక్కడి మార్కెట్‌లో గరువారం క్వింటాలు పత్తి గరిష్ఠ ధర రూ. 7361 పలికింది. 178 మంది రైతులు తీసుకు వచ్చిన 654 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ. 7361, కనిష్ఠ ధర రూ. 6811 లభించిందని ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథీరాజు వెల్లడించారు.

మార్కెట్‌కు సెలవులు...

సంక్రాంతి పండు పురస్కరించుకొని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 11నుంచి 15వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న క్రయ విక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

11 నుంచి సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

పెద్దపల్లి కమాన్, జనవరి 9 : జిల్లాలో ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహించే టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్ లోయర్, హయ్యర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో డీ మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు 11, 12, 16, 17 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం ఉంటాయని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు 11న ఉదయం, మధ్యాహ్నం, హయ్యర్ పరీక్షలు 12న ఉదయం, మధ్యాహ్నం, 16న ఉదయం నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు www.bse.telangana.gov.in హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో సూచించారు.

పెద్దపల్లి కమాన్: పిల్లలను ఆశీర్వదిస్తున్న చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్-రజనీ

ముందస్తు సంక్రాంతి సంబురాలు

పెద్దపల్లి కమాన్, జనవరి 9 : పెద్దపల్లి గాయత్రీ విద్యానికేతన్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భోగి మంటలు పెట్టారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పూలు, పండ్లు విద్యార్థులపై పోసి ఆశీర్వదించారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ అల్లెంకి రజనీ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్,జనవరి 9: గర్రెపల్లిలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరుణ, అంగన్‌వాడీ టీచర్ దేవరాజ్‌స్వర్ణలత ఉన్నారు.

ప్లే స్కూల్లో ముగ్గుల పోటీలు

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 9: మార్కండేయ కాలనీలోని లిటిల్ జూనియర్స్ ప్లే స్కూల్‌లో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్, అంజనీపుత్ర ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గుర్రాల సురేశ్ మాట్లాడారు. కరస్పాండెంట్ రేణిగుంట తిరుపతి, ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మేడిపల్లి గనిని సందర్శించిన ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్

గోదావరిఖని, జవవరి 9: ఆర్జీ-1లోని మేడిపల్లి ఉపరితల గనిని గురువారం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ బీ ప్రభాకర్, సీసీఎఫ్ కాళేశ్వరం సర్కిల్ సీహెచ్ శివయ్య, జిల్లా ఫారెస్ట్ అధికారులతో కలిసి సందర్శించారు. కొత్తగూడెంలో వీకే ఓసీపీ ప్రాజెక్టు కోసం మేడిపల్లి ఉపరితల గని వద్ద ప్రతిపాదించిన ఫారెస్ట్ భూమిని పరిశీలించారు. మేడిపల్లి వ్యూ పాయింట్ నుంచి క్వారీ ఓవర్ బర్డెన్ డంపులపై పెంచిన అటవీ ఏరియాను పరిశీలించారు. గని పరిసరాల్లో అటవీ విస్తరణ అభివృద్ధిపై చర్చించారు. ముందుగా అధికారులు సీఎల్యాండ్‌లో భాగంగా దాదాపు 650 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న మేడిపల్లి ఓసీపీ గనికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిన చేశారు. ఇక్కడ ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్, ఎస్టేట్ డీజీఎం కుమారస్వామి, ఏరియా ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఫారెస్ట్ అధికారి కర్ణ, ఎస్టేట్ మేనేజర్ మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

మొగుల్ పహాడ్ భూములకు పట్టాలు ఇప్పించండి

గోదావరిఖని, జనవరి 9: ఎన్టీపీసీ ప్రభావిత మొగుల్‌పహాడ్ భూములను ఎన్టీపీసీకి ఇవ్వకుండా గ్రామ రైతులకు పట్టాలు ఇప్పించాలని అంతర్గాం మండలం మొగుల్ పహాడ్ గ్రామ రైతులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కోరారు. గోదావరిఖనిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన రైతులు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఎన్టీపీసీ బూడిద చెరువుతో రైతులు, ప్రజలకు సంస్థ చేసిన నష్టంతో కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ ప్లాంటు విస్తరణతో మళ్లీ మొగుల్‌పహాడ్ వ్యవసాయ భూములను ఎన్టీపీసీకి అప్పగించేందుకు ప్రభుత్వం ఇటీవల సర్వే చేపట్టిందని, తమ భూములను ఎన్టీపీసీకి పోకుండా కాపాడాలని, సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇప్పించాలని కోరారు. ఇక్కడ రైతులు చిలుక ప్రసాద్, ఉప్పులేటి హన్మంతు, వంగపల్లి నర్సయ్య, దుబాసి నర్సయ్య, చిలుక రవి, చిలుక పోచయ్య ఉన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

గోదావరిఖని, జనవరి 9: పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను గురువారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తనిఖీ చేశారు. తరగతి గదులు, వాష్‌రూమ్స్, భోజనశాలను పరిశీలించారు. వాష్‌రూమ్స్‌లో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం, విద్యబోధనపై ఆరా తీశారు. ప్రభుత్వపై ఉన్న నమ్మకంతో పిల్లల తల్లిదండ్రులు హాస్టల్స్‌కు పంపిస్తున్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు వారి ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ తీసుకోవాలని ఎంపీ సూచించారు. మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఆర్జీ-3 అధికారులపై సీఎండీకి ఫిర్యాదు

రామగిరి, జనవరి 9: సింగరేణి ఆర్జీ-3 ఏరియా సర్వే అధికారి, డీవైజీఎంలపై సంస్థ సీఎండీకి పిర్యాదు చేయనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్ తెలిపారు. కాంట్రాక్టర్లకు రావల్సిన బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ, పండుగ వస్తుండడంతో కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందని, ఈ దృష్ట్యా బిల్లులు మంజూరు చేయాలని అడిగితే తమకు ఇష్టం వచ్చినప్పుడు చేస్తామని బదులిస్తున్నారని పేర్కొన్నారు. అంతేగాక డీవైజీఎం తన ఇంటికి సొంతానికి కాంట్రాక్ట్ కార్మికులతో పనులు చేయించుకుంటున్నాడని పేర్కొన్నారు.

మట్టి టిప్పర్లు అడ్డగింత

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9: కాల్వశ్రీరాంపూర్-పొత్కపల్లికి వెళ్లే రహదారి పనుల కోసం పాండవుల గుట్ట నుంచి మట్టిని తరలిస్తుండగా గురువారం గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ 597 సర్వే నెంబర్ గల పాండవుల గుట్ట విచ్చలవిడిగా కబ్జా అవుతుందనీ, అలాగే మట్టిని కూడా తరలించుపోతున్నట్లు ఆరోపించారు. కాగా ఎస్ఐ వెంకటేశ్ వెళ్లి టిప్పర్లను అడ్డుకోవద్దనీ, ప్రభుత్వ పనుల కోసం మట్టిని తీసుకు వెళ్తామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాగా తాము ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే అడ్డుకోవాల్సి వచ్చిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ముత్తారం, జనవరి 9: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బండ రామకృష్ణ (30) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి గోదావరిఖనికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

అద్దె వాహనాలకు టెండర్ నోటీస్

గోదావరిఖని, జనవరి 9: సింగరేణి ఆర్జీ-1లోని అన్ని గనులు, డిపార్టుమెంట్‌లో అద్దె ప్రతిపాదికన వాహనాలు నడుపుటకు ఆర్జీ-1 యాజమాన్యం టెండర్ నోటీసును జారీ చేసింది. సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజలు, కంపెనీ డిపెండెంట్ ఉద్యోగం లభించని కుటుంబ సభ్యులు, మాజీ ఉద్యోగులు ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో రూ. 590 చెల్లించి దరఖాస్తుతో పాటు రశీదును డిప్యూటీ(ఎస్ఈ), పర్చేస్ డిపార్టుమెంట్ కార్యాలయంలో సమర్పించి టెండర్ ఫారాలు స్వీకరించాలన్నారు. నిబంధనలు, షరతులు టెండర్ నోటీసులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13వ తేది సాయంత్రం 4గంటల వరకు టెండర్ నోటీసులను జారి చేస్తామని, టెండర్‌కు చివరికి గడువు ఈ నెల 15వ తేది మధ్యాహ్నం 12గంటల వరకు గడువు, అనంతరం 3.30 నుంచి టెండర్‌ను ఓపెన్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

11న క్రీడా వార్షికోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి9 :ఆర్జీ-2 ఏరియాలో ఈ నెల 11న క్రీడా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు అధికార ప్రతినిధి ఎస్. అనిల్ కుమార్ తెలిపారు. పర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఈఆర్ క్లబ్‌లో 11న సాయంత్రం 6గంటలకు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జీఎం బండి వెంకటయ్య బహుమతి ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

బొగ్గు ట్రాక్టర్ పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9 : సింగరేణి ఉత్పత్తి చేసిన బొగ్గును దొంగిలించి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్జీ-2 ఏరియా సెక్యూరిటీ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. బొగ్గును దొంగిలించి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్ తన సిబ్బందితో కలిసి ఎల్కలపల్లి గేట్‌లో తనిఖీ చేయగా, ట్రాక్టర్ పట్టుబడింది. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా సింగరేణి బొగ్గును దొంగిలించి సమీపంలో ఇటుక బట్టీలకు అమ్ముతున్నారు. దీంతో సింగరేణి యాజమాన్యం గట్టి నిఘా ఏర్పాటు చేసి బొగ్గు దొంగలను పట్టుకుంది. ట్రాక్టర్‌ను ఆదుపులోకి తీసుకుగానే ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు పరారైనట్లు తెలిసింది. పట్టుకున్న బొగ్గు విలువ ఆరు టన్నులు కాగా సుమారుగా 18వేల రూపాయల విలువ చేస్తుందని అధికారులు తెలిపారు.

ఉపాధి కల్పించాలి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9: గ్రామాల్లో అర్హులందరికీ జాబ్ కార్డులు అందజేసి ఉపాధి హామీలో పని కల్పించాలని డీఆర్డీవో కాళిందిని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ